క్లుప్తంగా

'పురం' మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసులు



హిందూపురం: పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా సంగం శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో సెక్రటరీగా పనిచేస్తున్న ఆయనను హిందూపురం కమిషనర్‌గా నియమించారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ



అగళిలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

అగళి: మహమ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్-ఉన్-నబీని మండలంలోని ముస్లింలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగానే అగళిలో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు సందేశం వినిపించారు. మహమ్మద్ ప్రవక్త సూచించిన విధంగా ముస్లింలంతా శాంతి, ధర్మం, సమానత్వంతో జీవనం సాగించాలన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు 'వీర్లగొంది'



ఫుట్‌బాల్ పోటీల్లో గెలుపొందిన వీర్లగొంది జట్టు

పావగడ: దసరా క్రీడోత్సవాలను పురస్కరించుకుని స్థానిక మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో ఆదివారం తాలూకా స్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 5 జట్లు తలపడ్డాయి. చివరి దాకా రసవత్తరంగా సాగిన పోటీల్లో వీర్లగొంది జట్టు ప్రథమ స్థానం, వైఎన్ హొసకోట ద్వితీయ స్థానంలో విజయం సాధించాయి. ప్రథమ స్థానం సాధించిన వీర్లగొంది జట్టు జిల్లా స్థాయి దసరా క్రీడా పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ కోచ్ అబ్దుల్ షకూర్, అల్కుందరాజ్, తలారి మను విజేతలను అభినందించారు.

జూదరుల అరెస్ట్



పేకాటరాయుళ్లను అరెస్టు చూపుతున్న పోలీసులు

లేపాక్షి: మండలంలోని విబూతిపల్లి గ్రామ శివారులో పేకాట స్థావరాలపై ఆదివారం చిలమత్తూరు ఎస్‌ఐ మునీర్‌అహమ్మద్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. తమకు వచ్చిన పక్కా సమాచారం మేరకు విబూతిపల్లి శివారులోకి వెళ్లి దాడులు నిర్వహించగా నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వారి వద్ద నుంచి ఆరు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా పేకాట నిర్వహిస్తున్న విబూతిపల్లికి చెందిన రామాంజితో పాటు మరో 9 మంది పరారయ్యారని వెల్లడించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వయోపరిమితి పెంచండి

పావగడ: జీవిత బీమా పరిహారాన్ని పొందడానికి పాల ఉత్పత్తి రైతుల వయోపరిమితిని 60 ఏళ్ల నుంచి జీవిత కాలానికి పెంచాలని బెళ్లిబట్లు పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర రెడ్డి జిల్లాస్థాయి పాల ఉత్పత్తి దారుల సంఘం ఎండీ శ్రీనివాస్‌ను కోరారు. తాలూకాలోని బెళ్లిబట్లు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన వార్షిక మహా సభలో ఆయన మాట్లాడారు. అనంతరం ఈ ఏడాది అత్యధిక పాల ఉత్పత్తిని సాధించిన రైతులు గోపాలకృష్ణ, మదకరి, సూరయ్యను ఘనంగా సన్మానించారు.

అదనపు గది నిర్మాణానికి భూమి పూజ



ఆస్పత్రి అదనపు గది నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అగళి: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి అదనపు భవన నిర్మాణం కోసం బ్లాక్ ప్రైమరీ హెల్త్ యూనిట్ పథకం కింద రూ.50 లక్షలు నిధులు మంజూరు అయ్యాయి. దీంతో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం కోడిపల్లి పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు.

బైపాస్ కెనాల్ హుళక్కేనా?



గుడిబండ వద్ద హంద్రీనీవా కాలువ దుస్థితి

నియోజకవర్గంలోని చెరువులకు పూర్తి స్థాయిలో కృష్ణా జలాలు అందించడానికి వీలుగా వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బైపాస్ కెనాల్ మంజూరు చేశారు. రూ.214.85 కోట్ల నిధులను కూడా విడుదల చేశారు. టెండర్లు కూడా పూర్తి చేశారు. బైపాస్ కెనాల్‌ను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ఎన్నికలప్పుడు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హామీ ఇచ్చారు. అయితే ఇంత వరకూ పనులు ప్రారంభించలేదు. అయితే ఈ కెనాల్ పూర్తి చేస్తే వైఎస్ జగన్‌కు మంచి పేరు వస్తుందనే అటకెక్కించే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

పరిశ్రమల స్థాపన ఎప్పుడో?



ఆర్.అనంతపురం దగ్గర పారిశ్రామికవాడ కోసం సేకరించిన భూమి (ఫైల్)

తాను గెలిచిన వెంటనే మడకశిర పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులను ఆదుకుంటానని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హామీ ఇచ్చినా ఫలితం లేకపోయింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.250 కోట్లతో ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. అలాగే కొన్ని ప్లాస్టిక్ పరిశ్రమలకు కూడా భూ కేటాయింపు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులవుతున్నా మడకశిర పారిశ్రామికవాడలో ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు

రాజు గారి హామీలు గాలికి !

- వంద రోజులపాలనంతా హడావుడి, ఆర్భాటమే
- మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి 10 ప్రధాన హామీలిచ్చిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు
- ఇంత వరకూ ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చని వైనం
- కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల అసంతృప్తి

మడకశిర నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం.. రింగ్‌రోడ్డు వేయించి మహర్దశ పట్టిస్తాం.. హంద్రీనీవా బైపాస్ కెనాల్ పూర్తి చేయించి సస్యశ్యామలం చేస్తాం. ఇలా ఒకటి కాదు రెండు కాదు ఏకంగా పది ప్రధాన హామీలను ఎన్నికల ముందు గుప్పించారు ప్రస్తుత ఎమ్మెల్యే ఎంఎస్ రాజు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తవుతున్నా కేవలం హడావుడి, ఆర్భాటం తప్ప ఆయన చేసింది శూన్యమన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

మడకశిర: మడకశిర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎంఎస్ రాజు తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్నికలప్పుడు నియోజకవర్గానికి ప్రధానంగా 10 హామీలు ఇచ్చారు. ఆ హామీలకు సంబంధించిన పత్రాన్ని కూడా విడుదల చేశారు. ఈ హామీలపైనే నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేసి ఎన్నికల్లో గెలుపొందారు. ప్రస్తుతం ఆయన ఎమ్మెల్యేగా వంద రోజులు పూర్తి చేసుకున్నారు. అయితే ఇంత వరకూ ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు.

మడకశిరకు రాని కృష్ణా జలాలు

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మడకశిరకు వరుసగా నాలుగేళ్లు కృష్ణా జలాలు అందించారు. మడకశిర చెరువు రెండుసార్లు నింపారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తవుతున్నా ఇంత వరకూ కృష్ణా జలాలు మడకశిరకు రాలేదు. ఎమ్మెల్యేగా తాను గెలిచిన వెంటనే కృష్ణా జలాలు అందిస్తానని ఎంఎస్ రాజు హామీ ఇచ్చినా నేటికీ పట్టించుకోలేదు. దీంతో సాగు నీరు లేక రైతులు నానా తంటాలు పడాల్సి వస్తోంది.



అగళి మండలం ముక్కడంపల్లి వద్ద కంపచెట్లతో నిండిపోయిన హంద్రీనీవా కాలువ

అన్నీ ఉత్తుత్తి మాటలే



ఎమ్మెల్యే ఎంఎస్ రాజువి ఉత్తుత్తి మాటలే. ఎమ్మెల్యేగా గెలిచి వందరోజులు పూర్తవుతున్నా ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులను ఆదుకోలేదు. మడకశిర రైతులకు ఇంత వరకూ కృష్ణా జలాలను అందించలేదు. ఎమ్మెల్యేది ప్రచార యావ, ఆర్భాటం, మాటల గారడీ మాత్రమే. మడకశిర ప్రజలకు కావాల్సింది మాటలు కాదు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ఇప్పటికైనా ఎమ్మెల్యే ఉత్తి మాటలు కట్టి పెట్టి అభివృద్ధి వైపు దృష్టి పెట్టాలి. అలాగే చంద్రబాబు వంద రోజుల పాలన కూడా అట్టర్ ఫ్లాప్ అయింది. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసగించారు.

– ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఇచ్చిన హామీలు

- హంద్రీనీవా కాలువలను వెడల్పు చేసి చెరువులను కృష్ణా జలాలతో నింపుతాం.
- ప్రతి గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పిస్తాం.
- రాళ్లపల్లి, రత్నగిరిల వద్ద రిజర్వాయర్లను నిర్మిస్తాం.
- ఆర్.అనంతపురం వద్ద పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తాం.
- ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో సబ్‌ప్లాన్ నిధులతో అభివృద్ధి పనులు చేపడతాం.
- మడకశిరకు రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తాం.
- గాయత్రి కాలనీలో పారిశ్రామికవాడ ఏర్పాటు చేస్తాం.
- అసంపూర్తిగా ఉన్న గురుకుల విద్యాలయం భవనాలను పూర్తి చేస్తాం.



మడకశిర ఎమ్మెల్యే ఇచ్చిన హామీల కరపత్రం



అమరాపురం వద్ద రైతు పండించిన వక్క



మడకశిర వద్ద సాగు చేసిన వక్క తోట

మార్కెట్ లేక వక్క రైతుల కష్టాలు

అమరాపురంలో వక్క మార్కెట్‌ను ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హామీ ఇచ్చారు. అయితే ఇంత వరకూ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ప్రస్తుతం వక్క సీజన్ ప్రారంభమైనా మార్కెట్ సౌకర్యం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

అంతా హడావుడి, ఆర్భాటమే



కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో హడావుడి, ప్రచార ఆర్భాటం మాత్రమే కనిపిస్తోంది. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఇచ్చిన ఏఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. వంద రోజుల పాలన అట్టర్ ఫ్లాప్ అయింది. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిన వారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయం.

– త్రిలోక్‌నాథ్, అమరాపురం

వలసలు పెరిగాయి



గెలిచిన వెంటనే పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తానని ఇచ్చిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హామీ ఇచ్చినా ఇంత వరకు నెరవేర్చలేదు. నిరుద్యోగులు పరిశ్రమల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం స్థానికంగా ఉద్యోగాలు దొరక్క నిరుద్యోగుల వలసలు పెరిగాయి. ఎమ్మెల్యే ఇచ్చిన హామీ ప్రకారం పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులను ఆదుకోవాలి.

– వెంకటేశ్, ఆర్.అనంతపురం, మడకశిర మండలం

రైతులకు అన్యాయం



మడకశిరకు కృష్ణా జలాలు అందించేలా చర్యలు తీసుకోకుండా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు రైతులకు అన్యాయం చేస్తున్నారు. గెలిచిన వెంటనే కృష్ణా జలాలు అందిస్తానన్న హామీ నీటి మీద రాతగానే మిగిలింది. అగళి మండలంలో హంద్రీనీవా కాలువల్లో కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి మూసుకుపోయాయి. వెంటనే నియోజకవర్గంలోని చెరువులన్నింటినీ నింపాలి.

– నాగరాజు, రైతు, అగళి

హామీలన్నీ నెరవేర్చాలి



ఇచ్చిన హామీలన్నీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు నెరవేర్చాలి. లేకపోతే ప్రజలు ప్రశ్నించడం ఖాయం. ముఖ్యంగా వక్క మార్కెట్‌ను ఏర్పాటు చేయాలి. ఉత్తుత్తి మాటల వలన ప్రయోజనం ఉండదు. సీజన్ ముగిసిన తర్వాత వక్క మార్కెట్ ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉండదు.

– రవికుమార్, బీజీ హళ్లి, రొళ్ల మండలం

బాలికలు అత్యున్నత స్థాయికి ఎదగాలి

రొళ్ల: బాలురకు ధీటుగా బాలికలు విద్యలో రాణించి అత్యున్నత స్థాయికి ఎదగాలని జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని అవినకుంటలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల 15వ వార్షికోత్సవం కార్యక్రమం పాఠశాల ఎస్‌ఓ మున్వార్‌జాన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా అనంతరాజు హాజరై విద్యార్థులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక అలరించాయి. ఎంపీపీ కవిత, కేజీబీవీ స్కూల్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'పీఎం సూర్యఘర్'యోజనను సద్వినియోగం చేసుకోండి

లేపాక్షి: పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశులు తెలిపారు. ఆదివారం లేపాక్షిలో రాంప్రసాద్ ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసిన 1.5 కిలో వాట్ల సోలార్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం వల్ల దీర్ఘకాలంలో ఎంతో ప్రయోజనం ఉంటుందని వెల్లడించారు. దీని ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ దేశాభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మిత్ర ఏజెన్సీ లక్ష్మయ్య, విద్యుత్‌శాఖ సిబ్బంది షాహిద్, ప్రభాకర్ పాల్గొన్నారు. మొత్తం రూ.1.50 లక్షలు ఖర్చుకాగా సబ్సిడీ రూ.60 వేలు వచ్చిందని రాంప్రసాద్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

3 నుంచి నవరాత్రి ఉత్సవాలు

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ తెలిపారు. ఉత్సవాల నిర్వహణపై ఆదివారం ఆలయ ప్రాంగణంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఏడాదిలా కాకుండా ఈసారి ఉత్సవాలను ప్రత్యేకంగా నిర్వహిద్దామని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని చైర్మన్ సూచించారు. సర్పంచ్ ఆదినారాయణ, దేవదాయశాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మడకశిరలో ఫుట్‌బాల్ పోటీలు

మడకశిర: పట్టణంలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మడకశిర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్డీటీ, ఏఎస్‌ఏ సహకారంతో ఫుట్‌బాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. మడకశిర వర్సెస్ హిందూపురం, మడకశిర వర్సెస్ పరిగి పోటీ పడ్డాయి. రసవత్తరంగా సాగిన రెండు మ్యాచుల్లో ఇరు జట్లు రెండు గోల్స్ సాధించడంతో సమజ్జీవులుగా నిలిచాయి.

హామీలు అమలు చేయలేకనే తప్పుడు ప్రచారం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల పవిత్రతను మంట గలిపారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ చంద్రబాబు తిరుమల లడ్డూపై చంద్రబాబు తప్పుడు ప్రచారం చేయడంతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. లడ్డూలో జంతువుల కొవ్వును కలిపారని తప్పుడు ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. లడ్డూ అపవిత్రం కాలేదని టీటీడీ అధికారులే ప్రకటించారని పేర్కొన్నారు. వైఎస్ జగన్ హయంలోనే తిరుమల పవిత్రతను కాపాడడానికి అనేక సంస్కరణలు తీసుకొచ్చిన విషయం అందరూ గమనించాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడానికి చేతగాక డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని చెప్పారు. లడ్డూపై దుష్ప్రచారం చేసిన చంద్రబాబును వేంకన్న శిక్షించడం ఖాయమని తెలిపారు. హామీలు అమలు చేయలేకపోతే సీఎం పదవి నుంచి తప్పుకోవాలని, అనవసరంగా వైఎస్ జగన్‌పై తప్పుడు ఆరోపణలు మానుకోక పోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

రాజకీయ లబ్ధి కోసమే అసత్య ఆరోపణలు

రొళ్ల: కేవలం రాజకీయ లబ్ధి కోసమే తిరుమల లడ్డూపై సీఎం చంద్రబాబు అసత్య ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు, పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి మండిపడ్డారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ దశాబ్దాల నుంచి నిబంధనల ప్రకారమే టీటీడీ లడ్డూ తయారీకి నాణ్యమైన నెయ్యి వాడుతోందన్నారు. అయితే భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా చంద్రబాబు అసత్య ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో ఏం జరిగినా మాజీ సీఎం వైఎస్ జగన్‌పై తోసేయడం కూటమి ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా 'ఇది మంచి ప్రభుత్వం' అని కూటమి నాయకులు ప్రజల్లో తిరగడం హాస్యాస్పందంగా ఉందన్నారు.

పరిహారం చెక్కుల పంపిణీ



రైతులకు చెక్కులు అందించిన మంత్రి సవిత

పెనుకొండ: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని భువన విజయం సమావేశ మందిరంలో ఆదివారం రాష్ట్ర మంత్రి సవిత భూపరిహారానికి సంబంధించిన చెక్కులను అందించారు. గతంలో మండలంలోని ఎర్రమంచి వద్ద ఏపీఐఐసీ ద్వారా మోడల్ లాజిస్టిక్ పార్క్ నిర్మాణం నిమిత్తం భూములను సేకరించారు. ఇప్పటికే పలువురికి పరిహారం అందజేయగా మిగిలిన 21 మంది రైతులకు సంబంధించిన రూ.10.72 కోట్ల చెక్కులను మంత్రి అందజేశారు. మంత్రి సవిత మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందించిన పరిహార సొమ్మును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొల్లకుంట అంజినప్ప, అధికారులతో పాటు గొందిపల్లి, ఎర్రమంచి, దుద్దేబండ, పెనుకొండ తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.



హిందూ మహాగణపతి విగ్రహ నిమజ్జనోత్సవంలో పాల్గొన్న భక్తులు

గంగఒడికి గౌరీపుత్రుడు

అమరాపురం: మండల కేంద్రంలోని వినాయకనగర్‌లో ఏర్పాటు చేసిన హిందూ మహాగణపతి విగ్రహాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. వినాయకనగర్ నుంచి ప్రారంభమైన శోభాయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కాల్వే సిద్దేశ్వరప్ప వ్యవసాయ బావిలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. సీఐ రాజ్‌కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు.



వాయిద్యాలతో కళాకారులు